యాదగిరిగుట్టలో సుదర్శన నారసింహ హోమం

సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 31 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. శుక్రవారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీ సమేతుడైన నారసింహ స్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణతంతు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ జరిపారు. రాత్రి స్వామివారికి తిరువరాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. సుమారు 27 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.39,43,778 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

తెలంగాణ చరిత్రను చెరిపి వేస్తే ఊరుకునేది లేదు

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యాస ఇంద్రారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఇంద్రారెడ్డి

ఆత్మకూరు(ఎం), మే 31 : ఏనాడూ జై తెలంగాణ అనని సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ చరిత్రను చెరిపి వేయాలని చూస్తే ఊరుకునేది లేదని, అన్ని వర్గాల ప్రజలు తిరగబడి రేవంత్‌రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దింపుతారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యాస ఇంద్రారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర చిహ్నం నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకోబోరని మండిపడ్డారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న రోజుల్లో ప్రజలు నిలదీస్తారని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక, వారసత్వానికి ప్రతీకగా ఉండేలా మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర రాజముద్రను రూపొందించడాన్ని నాడు ప్రజలంతా హర్షించారని, నేడు రేవంత్‌రెడ్డి చారిత్రక చిహ్నాలను తొలగించడం సరి కాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, జిల్లా నాయకులు కోరె భిక్షపతి, బాషబోయిన ఉప్పలయ్య, మండల నాయకులు దశరథగౌడ్, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు నాగరాజు, మల్లికార్జున్, సతీశ్, విశాల్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఎంఈఓ కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

భూదాన్‌పోచంపల్లి, మే 31 : పట్టణ కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. గదులకు డోర్లు సరిగా లేకపోవడం, రూములు చెత్తాచెదారంతో నిండిపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. కార్యాలయానికి అధికారులు వచ్చిపోతుంటారే తప్ప కనీసం పట్టించుకున్న నాథుడే లేరు. ఇకనైనా అధికారులు మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పామాయిల్ సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన

జంగారెడ్డిపల్లిలో పామాయిల్ తోటను సందర్శించి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

వలిగొండ, మే 31 : మండలంలోని జంగారెడ్డిపల్లిలో రైతు పల్లె విష్ణువర్ధన్‌రెడ్డి పామాయిల్ క్షేత్రాన్ని ఉద్యానవన శాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులు శుక్రవారం సందర్శించి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి అన్నపూర్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పామాయిల్ సాగులో పాటించాల్సిన నీటి యాజమాన్య పద్ధతులు, ఆబ్లేషన్(పూలగుత్తుల కత్తిరింపు), అధిక ఉష్ణోగ్రతల నుంచి చెట్ల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పచ్చి రొట్ట వాడకం, కొమ్ముపురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలతోపాటు ఫర్టిగేషన్ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ టెక్నికల్ అడ్వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కవిత, ఆయిల్‌ఫెడ్ డీసీఓ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రశాంత్, హరీశ్, కమలాకర్, మమత, వినయ్, బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

ఇండ్ల మధ్యే చెత్తాచెదారం

ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని ఇండ్ల మధ్య ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దాంతో దుర్వాసనతోపాటు దోమలు, ఈగలు విజృంభిస్తుండడంతో చుట్టు పక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని, అలాగే ఖాళీ స్థలాల యజమానులకు నోటీలు జారీ చేసి చుట్టూ ప్రహరీ నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-ఆత్మకూరు(ఎం), మే 31

పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ గంగాధర్

● పలు పాఠశాలల్లో పనుల పరిశీలన

బొమ్మలరామారం : ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

తుర్కపల్లి, మే 31 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలంలోని మాదాపురం, మల్కాపురం పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఏకరూప దుస్తులు కుట్టే కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు సకాలంలో దుస్తులు అందించాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీ బాయి, ఎంఈఓ కృష్ణ, ఏఈ అమరేందర్‌రెడ్డి, ఏపీఎం యాదగిరి పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలం కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హాజీపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో జరుగున్న పాఠశాల అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభం నాటికి పనులన్నీ పూర్తికావాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో వసతులు కల్పించడంలో అమ్మ ఆదర్శ కమిటీలు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, సీఆర్పీలు శ్రీహరి, విశ్వరూపం, జహంగీర్, పంచాయతీ కార్యదర్శి హనుమాన్ ఉన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : చందుపట్లలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

జూన్ 5 నాటికి పనులు పూర్తి చేయాలి : జడ్పీ సీఈఓ

భువనగిరి కలెక్టరేట్ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను జూన్ 5 లోగా పూర్తిచేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. శుక్రవారం మండలంలోని కేసారం, చందుపట్ల పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, మండల పంచాయతీ అధికారి అనూరాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏనుగు చిత్తరంజన్‌రెడ్డి ఉన్నారు.

చౌటుప్పల్‌లో హనుమాన్ జయంత్యుత్సవాలు

చౌటుప్పల్ : హోమం నిర్వహిస్తున్న భక్తులు

చౌటుప్పల్, మే 31: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పెరుమాళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మొదటి రోజు గణపతి, నవగ్రహ పూజలతో పాటు ధ్వజారోహణం, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీనివాసచారి, అన్నమోని చంద్రయ్య, దేప రాజు, అన్నమోని రాజేశ్ పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని వడాయిగూడెం గ్రామ సమీపంలోని సురేంద్రపురి, మాసుకుంట పరిధిలోని రాజరాజేశ్వర స్వామి, స్వర్ణగిరి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను నేడు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. వేడుకలకు ఆలయాలను ముస్తాబు చేశారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలి

● రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలరాజు

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలరాజు

భువనగిరి అర్బన్, మే 31 : పాడి రైతులకు పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు కోరారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో పాడి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి రైతులకు లీటర్‌కు రూ.4 ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమను నమ్ముకొని దాదాపు 7.5 లక్షల మంది పాడి రైతులు జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. వారికి పదిహేను రోజులకోసారి పాల బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని పాల సంఘం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. పాడి పశువులకు ప్రభుత్వం బీమా పథకం ప్రవేశపెట్టాలని, రైతులకు గడ్డి కట్టర్ మిషన్లు, పాలు పితికే మిషన్లతోపాటు 50 శాతం సబ్సిడీతో దాణా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మంగ నర్సింహులు, భూరుగు కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు చీరిక అలివేలు, బోయిని ఆనంద్, కందాడి సత్తిరెడ్డి, సభ్యులు చీరిక సంజీవరెడ్డి, పొట్ట శ్రీను, గన్నెబోయిన విజయ, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రజా సంఘాలను గౌరవించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్

రాజాపేట, మే 31 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కుల, ప్రజా సంఘాలను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో గుర్తించి గౌరవించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యమ సమయంలో గ్రామాల్లో, పట్టణాల్లో జాయింట్ కమిటీలు ఏర్పడి కుల వృత్తులను భాగస్వాములను చేసి రాష్ట్ర సాధన ఆవశ్యకతను చాటి చెప్పాయని, అలాంటి వారి ఆత్మగౌరవం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

చౌటుప్పల్, మే 31 : చౌటుప్పల్ సింగిల్ విండో కార్యాలయంలో కరీంనగర్ నిత్యా వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆ సంస్థ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ-1010, ఐఆర్-64, ఎంటీయూ-1153, ఎంటీయూ-1156, జెజీఎల్- 24423, ఆర్ఎన్ఆర్-15048, బీపీటీ-5204 ఉన్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని సూచించారు.

ఆర్థిక సాయం

భూదాన్‌పోచంపల్లి, మే 31 : మండలంలోని ఇంద్రియాలకు చెందిన సీపీఐ మాజీ మండల కార్యదర్శి భీమగోని నర్సింహ మాతృమూర్తి భీమగోని నర్సమ్మ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బండి కృష్ణ మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి యాదగిరి, గరిసె జంగయ్య, సుర్వి బాలరాజుగౌడ్, గంగాపురం మల్లేశ్, బండి జ్ఞానేశ్వర్, మల్లేశ్ గౌడ్, మొగిలిపాక పోచయ్య, గగులోతు దేవా, గగులోతు మహిపాల్‌నాయక్, బర్మావత్ బీకూనాయక్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి : సీపీఎం

భూదాన్‌పోచంపల్లి, మే 31 : మండలంలోని భీమనపల్లిలో మురుగు రోడ్డు పైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కోట రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో భీమనపల్లి నుంచి కనుముక్కుల గ్రామానికి వెళ్లే దారిలో మురుగు రోడ్డు పైకి రావడాన్ని పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైకి మురుగు రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, మంచాల మధు, మండల కమిటీ సభ్యులు కలుకూరి భిక్షపతి, నెలకంటి జంగయ్య, నాయకులు భిక్షపతి, పురుషోత్తంరెడ్డి, జంగారెడ్డి, మల్లేశ్, పాండు రంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, నర్సింహ, జనార్దన్ పాల్గొన్నారు.

మురుగు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన

ఆలేరు రూరల్ : అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ పాపారావు, వైద్య సిబ్బంది

ఆలేరు రూరల్, మే 31 : ప్రపంచ పొగాకు నిషేధిత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆలేరు పట్టణంలో శారాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పాపారావు పాల్గొని మాట్లాడుతూ.. పొగాకు వాడితే క్యాన్సర్ దారి తీస్తుందని, ప్రజలు పొగాకు వాడకాన్ని నిషేధించాలని అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి పొగాకు నిషేధానికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద, ప్రోగ్రాం ఆఫీసర్ సుమన్, రామకృష్ణ, వంశీకృష్ణ, శారాజీపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు : పొగాకుతో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం రోగులకు పొగాకుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు పీహెచ్‌సీలో పొగాకు నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పొగాకుతో ప్రాణానికే ప్రమాదం

భువనగిరి అర్బన్ : పొగాకుతో ప్రాణానికే ప్రమాదమని బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి చంద్ర అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బస్టాండ్‌లో పొగాకుతో కలిగే నష్టాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, రామేశ్వర్, అరుణ, ప్రియ పాల్గొన్నారు.

యూనిఫాం సకాలంలో అందించాలి

● డీఆర్డీఓ పీడీ కృష్ణన్

కొలనుపాకలో ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్డీఓ పీడీ కృష్ణన్

ఆలేరు రూరల్, మే 31 : పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌ను నాణ్యతతో కుట్టి సకాలంలో అందించాలని డీఆర్డీఓ పీడీ కృష్ణన్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొలనుపాకలో ఏకరూప దుస్తులు కుట్టే సెంటర్‌ను ఆయన సందర్శించి మహిళలకు పలు సూచనలు చేశారు. జిల్లాలో 34,130 మంది విద్యార్థులకు దుస్తులు కుట్టిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం లోపే దుస్తులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం మీనా, సీసీ సరస్వతి, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు పద్మ, సంతోష పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన..

అలాగే మండలంలోని కొలనుపాక జడ్పీహెచ్ఎస్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను డీఆర్డీఓ పీడీ కృష్ణన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తిచేసి విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిర్వహణ కమిటీలకు సూచించారు. కార్యక్రమంలో అమ్మ అదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పద్మ పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారిని కుటుంబ సభ్యులకు అప్పగింత

చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

బీబీనగర్, మే 31 : తప్పిపోయిన చిన్నారిని గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మండలంలోని వెంకిర్యాలకు చెందిన మహ్మద్ అజీజ్ మూడేండ్ల కూతురు మహ్మద్ ముస్కాన్ బుధవారం రాత్రి ఇంటి నుంచి తప్పిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు పాపను వెతుకుతుండగా గ్రామానికి చెందిన రఫీక్ ఉయ్యాల కుంట వద్ద బర్రెల షెడ్డులో పని చేస్తున్న వారి వద్ద పాప ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వచ్చి పాపను స్టేషన్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం డీసీపీ రాజేశ్‌చంద్ర సమక్షంలో చిన్నారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ రమేశ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విత్తన షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

వలిగొండలోని బాలాజీ ట్రేడర్స్‌లో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు, వ్యవసాయ అధికారులు

వలిగొండ, మే 31 : మండలంలోని పలు విత్తన షాపుల్లో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని బాలాజీ ట్రేడర్స్, రైతు సేవా కేంద్రం, ఫ్యూచర్ క్రాప్, ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, నరేంద్ర కమీషన్స్, గణేశ్ ట్రేడర్స్‌తోపాటు ముద్దాపురంలోని వెంకటేశ్వర సీడ్స్‌లో ఆలేరు ఏడీఏ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలోని ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. ఫ్యూచర్ క్రాప్ షాపులో రూ.2,51,400, ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.1,35,000, వెంకటేశ్వర ట్రేడర్స్(ముద్దాపురం)లో రూ.3లక్షల విలువైన విత్తన సంచులకు లేబులింగ్ క్లియర్‌గా లేనందున స్టాప్ సేల్ విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొన్న రైతులకు బిల్లు రసీదులు ఇవ్వాలని షాపు నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వలిగొండ ఏఓ అంజనీదేవి, అడ్డగూడూర్ ఏఓ అరుణ, మోత్కూర్ ఏఓ స్వప్న పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

ఆలేరు రూరల్ : పట్టణ కేంద్రంలోని లక్ష్మీ నరసింహ, గ్రోమోర్ ఎరువుల దుకాణాల్లో జిల్లా విత్తన తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. విత్తనాలను ఎమ్మార్పీకి మించి అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఏడీఏ పద్మావతి, ఏఓలు దుర్గేశ్వరి, పద్మ, దీప్తి, పోలీసులు పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రణాళికపై రైతులకు అవగాహన

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

రామన్నపేట, మే 31 : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు వానకాలం ముందస్తు ప్రణాళికపై మండలంలోని ఇంద్రపాలనగరంలోని రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి పర్యాటక కేంద్రం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త అనిల్‌కుమార్, మమత మాట్లాడుతూ.. వేసవిలో దుక్కులు దున్నుకోవడంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేంద్రియ ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించారు. తెగుళ్లు, చీడపురుగుల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మజ, ఏఈఓలు కిరణ్, వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

భువనగిరి కలెక్టరేట్, మే 31 : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమవడంతోపాటు పక్కనే కట్టేసిన పాడి గేదెకు గాయాలైన సంఘటన మండలంలోని మన్నెవారిపంపు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన విడవైన సురేశ్ వ్యవసాయ క్షేత్రం వద్ద గడ్డివాముకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఈ క్రమంలో గడ్డివాము పక్కనే పశువుల కొట్టంలో కట్టేసిన పాడి గేదెకు గాయాలయ్యాయి. ప్రమాదంలో రూ.20 వేల విలువైన గడ్డి దగ్ధమవడంతోపాటు రూ.లక్ష విలువైన గేదెకు తీవ్ర గాయాలయ్యాయని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి

మోత్కూరు, మే 31 : మున్సిపాలిటీలోని గాంధీనగర్‌కు చెందిన వృద్ధురాలు కూరెళ్ల పాపమ్మ(63) అనుమానాస్పదంగా మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన కూరెళ్ల పాపమ్మకు ఇద్దరు కుమారులు. వీరిద్దరు వేర్వేరుగా ఉంటుండగా, తల్లి కోసం ప్రత్యేకంగా కట్టిన రూమ్‌లో ఆమె ఉంటుంది. గురువారం రాత్రి 8 గంటల సమయంలో చిన్న కొడుకు పరమేశ్ ఇంటికి వెళ్లి వచ్చిన పాపమ్మ శుక్రవారం ఉదయం నీటి సంపులో శవమై కనిపించింది. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. పరమేశ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి మృతదేహానికి పంచనామా చేశారు. పోస్టుమార్టం కోసం రామన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.